

క్రీస్తు నామం..మార్మోగే క్షణం

ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ధారూరు మెథడిస్ట్ క్రిస్టియన్ ఉత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. 8లో▸



గ్రంథాలయానికి గ్రహణం

దౌల్తాబాద్ మండల కేంద్రంలోని గ్రంథాలయానికి శాశ్వత గ్రంథపాలకుడు లేక పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. 8లో▸



కూలీల కరువు..

పంట చేతికొచ్చిన సమయంలో కూలీలు దొరకక పత్తి రైతులు సతమతమవుతున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

చట్టాలపై అవగాహన ఉండాలి



న్యాయవాదులను సన్మానిస్తున్న అధ్యాపకులు

మర్పల్లి: న్యాయ వ్యవస్థ, చట్టాలపై విద్యార్థులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సహాయ కౌన్సిల్ వెంకటేశం, డిప్యూటీ కౌన్సిల్ రమేష్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం మర్పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు 'న్యాయ వ్యవస్థ–చట్టాలపై అవగాహన' కార్యక్రమం నిర్వహించారు. ఏఏ చట్టం ఏవిధంగా పనిచేస్తుంది, న్యాయం కోసం ఏవిధంగా న్యాయ వ్యవస్థను ఆశ్రయించాలనే పలు విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం కళాశాల అధ్యాపకులు న్యాయవాదులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్స్‌పాల్ పండరీనాథ్, అధ్యాపకులు గురుపాదప్ప, రఘువీర్, వీరేశం, భాస్కర్, కార్తీక, లక్ష్మణ్, మజీద్, వెంకటేశం, పెంటయ్య కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడండి

ఎమ్మెల్యే యాదయ్యతో మాజీ సీఎం కేసీఆర్



మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే యాదయ్య

నవాబుపేట: మూడోసారి చేవెళ్ల ఎమ్మెల్యేగా విజయం సాధించిన యాదయ్య సోమవారం ఎర్రవల్లిలోని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా హ్యాట్రిక్ సాధించటం పట్ల కేసీఆర్ యాదయ్యను అభినందించారు. నిత్యం ప్రజల్లో ఉండి ప్రజాసమస్యలపై పోరాడాలని సూచించినట్లు ఎమ్మెల్యే యాదయ్య తెలిపారు.

ఆంజనేయా.. మొక్కు తీరెనయా

- ఎమ్మెల్యేగా ప్రసాద్‌కుమార్ గెలుపు
- 101 కొబ్బరికాయలు కొట్టిన నేతలు



కొబ్బరి కాయలు కొడుతున్న నాయకులు

మర్పల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో వికారాబాద్ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేసిన గడ్డం ప్రసాద్‌కుమార్ గెలుపొందితే ఆంజనేయ స్వామి ఆలయంలో 101 కొబ్బరి కాయలు కొడతామని మర్పల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మొక్కుకున్నారు. ఈ క్రమంలో ఆదివారం వెలువడిన ఫలితాల్లో వికారాబాద్ నుంచి గడ్డం ప్రసాద్‌కుమార్ 12వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందిన విషయం తెలిసిందే. దీంతో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శివ, శేఖర్, గణేశ్, అంబేడ్కర్ కాలనీకి చెందిన కార్యకర్తలు సోమవారం ఆంజనేయ స్వామి ఆలయంలో 101 కొబ్బరి కాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. అలాగే మండల పరిధిలోని తుమ్మలపల్లిలో కాంగ్రెస్ నాయకులు సైతం ఆంజనేయ స్వామి ఆలయంలో కొబ్బరి కాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు.

స్వల్ప తేడాతో గట్టెక్కాడు

మొయినాబాద్: చేవెళ్ల నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కాలె యాదయ్య స్వల్ప మెజార్టీతో విజయం సాధించిన విషయం తెలిసిందే. మొదట్లో ఆయన మెజార్టీ పెరుగుతూ వచ్చింది. అయితే మొయినాబాద్, షాబాద్, చేవెళ్ల మండలాల్లో కాంగ్రెస్ అభ్యర్థి భీంభరత్‌కు లీడ్ ఇచ్చాయి. బీఆర్‌ఎస్ అభ్యర్థి యాదయ్యకు నవాబ్‌పేట్ మండలంలో 1,966 ఓట్ల మెజార్టీ, శంకర్‌పల్లి మండలంలో 5000 ఓట్ల మెజార్టీ వచ్చింది. కాంగ్రెస్ అభ్యర్థి భీంభరత్‌కు మొయినాబాద్ మండలంలో 1,760 ఓట్ల మెజార్టీ, షాబాద్ మండలంలో 1,564 ఓట్ల మెజార్టీ, చేవెళ్ల మండలంలో 2,100 ఓట్ల మెజార్టీ వచ్చింది. పోస్టల్ బ్యాలెట్ ఓట్లలోనూ కాంగ్రెస్ అభ్యర్థికి 575 ఓట్ల లీడ్ వచ్చినప్పటికీ కాంగ్రెస్ అభ్యర్థి విజయాన్ని అందుకోలేకపోయారు. శంకర్‌పల్లి మండలంలో యాదయ్యకు ఏకంగా 5000 ఓట్ల ఆధిక్యం రావడంతో చివరికి 268 ఓట్లతో గట్టెక్కారు.

అమాత్య యోగమెవరికో?

- జిల్లా నుంచి ఒకరికి మంత్రి పదవి దక్కే అవకాశం
- రేసులో గడ్డం ప్రసాద్‌కుమార్, టీఆర్‌ఆర్



వికారాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లా ప్రజలు కాంగ్రెస్ పార్టీకి క్లీన్‌స్వీప్ కట్టబెట్టిన అనంతరం గెలిచిన వారిలో అమాత్యులు ఎవరా..? అనే చర్చ మొదలయ్యింది. అందరూ కాంగ్రెస్ అభ్యర్థులే గెలుపొందటంతో పాటు ఆ పార్టీయే అధికారంలోకి రానుండటంతో మంత్రి పదవి విషయమై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. కొడంగల్ నుంచి గెలుపొందిన రేవంత్‌రెడ్డికే సీఎం అయ్యే అవకాశం ఉండటంతో జిల్లాకు మరో బెర్తు దక్కే అవకాశం ఉందని సమాచారం. అయితే పార్టీ ఏదైనా ఉమ్మడి జిల్లా నుంచి ఒకరికి లేదా ఇద్దరికి మంత్రి పదవులు కట్టబెడుతూ వస్తున్న విషయం తెలిసిందే. రంగారెడ్డి జిల్లాలో మెజార్టీ సీట్లు బీఆర్‌ఎస్ దక్కించుకోగా రెండుచోట్ల మాత్రమే కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందారు. వారిలోనూ సీనియర్లు లేకపోవటంతో వికారాబాద్ జిల్లాకు చెందిన ఒక నేతకు మంత్రి పదవి తప్పనిసరిగా దక్కే అవకాశం ఉందనే ప్రచారం సాగుతోంది.

మాజీ మంత్రి అనుభవం కలిసొచ్చేనా..

జిల్లా పరిధిలోని నాలుగు సెగ్మెంట్లలో ఎప్పుడూ లేనివిధంగా ఈసారి నలుగురు కూడా ఒకే పార్టీకి చెందిన అభ్యర్థులు విజయం సాధించారు. ఇందులో కొడంగల్ సెగ్మెంట్ నుంచి గెలుపొందిన పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సీఎం కానున్నారు. దీంతో కేబినెట్‌లో ఆయన ఎలాగు ఉంటారు కాబట్టి మరొకరికి అవకాశం దక్కనుందని రాజకీయ విశ్లేషకుల అంచనా. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీ సీనియర్ నేత గడ్డం ప్రసాద్‌కుమార్‌కు మంత్రి పదవి ఇస్తామని ప్రచారంలో భాగంగా పలుమార్లు రేవంత్‌రెడ్డి ప్రకటించడం దీనికి మరింత బలం చేకూరుతోంది. ప్రసాద్‌కుమార్ 2008లో జరిగిన ఉప ఎన్నికలో మొదటిసారి ఎమ్మెల్యేగా గెలుపొందగా ఆ వెంటనే 2009లో జరిగిన సాధారణ ఎన్నికల్లో సైతం వికారాబాద్ నుంచి మరోమారు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా కూడా పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది. ఈ లెక్కలన్నీ చూస్తే కేబినేట్ బెర్తు దాదాపు ఆయనకే ఖరారయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

మచ్చలేని నేతగా టీఆర్‌ఆర్

సుదీర్ఘ కాలం కాంగ్రెస్ పార్టీకి సేవలందిస్తూ వస్తున్న టీ.రామ్మోహన్‌రెడ్డి 2014లో జరిగిన ఎన్నికల్లో కారు జోరును తట్టుకుని మాజీ డిప్యూటీ స్పీకర్ హరీశ్వర్‌రెడ్డిపై మొదటిసారి పరిగి నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. అనంతరం 2018 ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. ప్రస్తుతం ఆయన పరిగి ఎమ్మెల్యేగా 23వేల పైచిలుకు ఓట్ల మెజార్టీతో గెలుపొంది సత్తా చాటారు. ఆయన రాజకీయ ప్రస్థానం మొదలు పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా.. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా పార్టీని మాత్రం వీడలేదు. మచ్చలేని నాయకుడిగా పేరుతెచ్చుకోవటంతో టీఆర్‌ఆర్‌కు నియోజకవర్గ ప్రజలు రెండోసారి పట్టంగట్టారు. దీనికి తోడు ఆయనకు ఢిల్లీ వరకు పరిచయాలు ఉండటంతో ఆయనకు కూడా మంత్రి పదవి దక్కే అవకాశం లేకపోలేదని ఆయన సన్నిహితులు పేర్కొంటున్నారు. అయితే రెడ్డి సామాజిక వర్గంనుంచి కేబినెట్ బెర్తులకు పోటీ ఎక్కువగా ఉండటం... ప్రసాద్‌కుమార్‌కు మంత్రి పదవి దక్కితే అప్పటికే జిల్లా నుంచి కేబినెట్‌లో ఇద్దరు ఉండటం తదితర ఈక్వేషన్ల నేపథ్యంలో మంత్రి పదవి ఆయన్ను వరిస్తుందా..? లేదా అనే చర్చ కూడా సాగుతోంది. అయితే ఉమ్మడి జిల్లాలా వారిగా చూస్తే కొడంగల్ మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోకి వచ్చే అవకాశం ఉండటంతో టీఆర్‌ఆర్ అనుచరుల్లో తమ ఎమ్మెల్యే మంత్రి కావటం ఖాయమని భావిస్తున్నారు. మాజీ మంత్రి, దివంగత నేత కమతం రాంరెడ్డి తర్వాత పరిగి నుంచి ఇప్పటివరకు అమాత్యయోగం ఎవరికీ దక్కలేదు. ఈ సారైనా తమ ఎమ్మెల్యే మంత్రి అయితే స్థానికంగా మరింత అభివృద్ధి జరుగుతుందని పరిగి నియోకవర్గ ప్రజలు ఆశిస్తున్నారు.



గడ్డం ప్రసాద్‌కుమార్, వికారాబాద్



రామ్మోహన్‌రెడ్డి, పరిగి



వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

ధాన్యం ప్రభుత్వమే కొంటుంది

- దళారులను ఆశ్రయించి మోసపోవద్దు
- అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్
- దోమలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

దోమ: జిల్లాలో మొత్తం 122 వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని.. ఏ రైతు కూడా దళారులను ఆశ్రయించి మోసపోవద్దని జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. సోమవారం దోమ మండల కేంద్రంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా పౌర సరఫరాల అధికారి రాజేశ్వర్‌తో కలసి అడిషనల్ కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన వసతులను కల్పించామని అన్నారు. గోనెసంచులు, టార్పాలిన్లు, తూకం యంత్రాలు, తేమ పరిశీలించే యంత్రాలను అందుబాటులో ఉంచామన్నారు. తేమశాతం 17 ఉండేలా వరి ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. ఏ–గ్రేడ్ మద్దతు ధర రూ.2,203, బి–గ్రేడ్ మద్దతు ధర రూ.2,183గా రైతులకు ఇస్తామన్నారు. ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించేందుకు రవాణా సదుపాయాన్ని కూడా కల్పించామని అన్నారు.

ఫిర్యాదు చేయండి

జిల్లా వ్యాప్తంగా ఈ వానకాలంలో పండించిన సుమారు 2.30 లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. తూకాల్లో మోసాలు ఉంటే చర్యలు తప్పవన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు తలెత్తితే రైతులు వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. విచారణ జరిపి వెంటనే అట్టి కొనుగోలు కేంద్రం నిర్వాహకుడిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ ఇన్‌చార్జి సంతోష్, నిర్వాహకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



కుల్కచర్ల పీఏసీఎస్ కార్యాలయం

కౌన్ బనేగా చైర్మన్ ?

- తాండూరు ఎమ్మెల్యేగా గెలుపొందిన మనోహర్‌రెడ్డి
- కుల్కచర్ల పీఏసీఎస్ చైర్మన్ పదవికి రాజీనామా చేయాల్సిన పరిస్థితి
- చైర్మన్ పీఠంపై సభ్యుల గంపెడాశలు

కుల్కచర్ల: రాజకీయాల్లో ఏ క్షణం ఎటువంటి మార్పులు చోటుచేసుకుంటాయో ఊహించలేం. అటువంటి సందర్భమే కుల్కచర్ల మండలంలో ప్రస్తుతం చోటు చేసుకుంది. ప్రస్తుతం కుల్కచర్ల పీఏసీఎస్ చైర్మన్‌గా పనిచేస్తున్న బుయ్యని మనోహర్‌రెడ్డి తాజా అసెంబ్లీ ఎన్నికల్లో తాండూరు ఎమ్మెల్యేగా గెలుపొందడంతో తాను ముందుగా పనిచేస్తున్న పీఏసీఎస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ పదవులకు రాజీనామా చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఫిబ్రవరి 2020లో కుల్కచర్ల ప్రాథమిక సహకార సంఘానికి జరిగిన ఎన్నికల్లో మనోహర్‌రెడ్డి తన రాజకీయ చాణక్యంతో ఇతర పార్టీల నేతలను సమన్వయపరుచుకుని పోటీలో ఎవరూ లేకుండా ఎన్నిక ఏకగ్రీవంగా జరిగేవిధంగా చూసుకున్నారు. పీఏసీఎస్ చైర్మన్‌గా ఎన్నికైన అనంతరం ఆయన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్‌గా కూడా ఎన్నికయ్యారు. నాటి నుంచి నేటి వరకు కుల్కచర్ల మండల పరిధిలోని గ్రామాలతో పాటుగా ఉమ్మడి రంగారెడ్డి డీసీసీబీ చైర్మన్‌గా రైతాంగ అభ్యున్నతికై సహకార సంఘం ఆధ్వర్యంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారు. అనంతరం పరిగి నియోజకవర్గ ఎమ్మెల్యే స్థానం నుంచి పోటీచేయాలనుకున్న ఆయనకు అధిష్ఠానం తాండురు నియోజకవర్గం నుంచి ఛాన్స్ ఇచ్చింది. తాజా ఎన్నికల్లో ఆయన తాండూరు నుంచి పోటీచేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

చైర్మన్ హోదా ఎవరికి దక్కేనో..

బుయ్యని మనోహర్‌రెడ్డి ప్రస్తుతం తాండురు నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఇతర ఏ పదవుల్లో కొనసాగేందుకు దాదాపుగా అవకాశం లేదు. కుల్కచర్ల మండల ప్రాథమిక సహకార సంఘం చైర్మన్‌గా కొనసాగుతున్న ఆయన ప్రస్తుతం ఆ పదవికి రాజీనామా చేయాల్సిన పరిస్థితి నెలకొంది. మరో రెండు సంవత్సరాల కాలంపాటు ఆ పదవీకాలం కొనసాగనుండగా మనోహర్‌రెడ్డి రాజీనామా చేస్తే చైర్మన్ హోదాలో ఎవరికి అవకాశం దక్కుతుందోనని ప్రస్తుతం చర్చ కొనసాగుతోంది. జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ తన ప్రభావాన్ని పెంచుకున్న నేపథ్యంలో పీఏసీఎస్ చైర్మన్ పదవిని సైతం తన ఖాతాలో వేసుకుంటుందా లేదా ప్రస్తుతం ఉన్న వైస్ చైర్మన్ లేదా ఎవరైనా డైరక్టర్లు చైర్మన్‌గా ఎన్నిక కానున్నారా అనేది సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. మరికొద్దిరోజుల్లో ఈ అంశంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

డిపాజిట్లు గల్లంతు

- జిల్లాలో ప్రభావం చూపని బీజేపీ, బీఎస్పీ
- పరిగిలో పరువు నిలుపుకొన్న బీజేపీ
- డిపాజిట్లు కోల్పోయిన 52మంది అభ్యర్థులు



ఓట్ల లెక్కింపు నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

వికారాబాద్: కేంద్రంలో అధికారంలోకి ఉన్నప్పటికీ అసెంబ్లీ ఎన్నికల్లో వికారాబాద్ జిల్లాలో ఆ పార్టీ నేతలు పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. ఒక్క పరిగిలో మినహా మిగతా మూడు స్థానాల్లో ఆ పార్టీ నేతలు డిపాజిట్లు కూడా దక్కించుకోలేకపోయారు. మొత్తంగా జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో పరిగిలో 15 మంది అభ్యర్థులు, వికారాబాద్‌లో 12, తాండూరులో 21, కొడంగల్‌లో 13 మంది మొత్తం 61 మంది ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేశారు. ఇందులో నలుగురు కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందగా.. బీఆర్‌ఎస్ పార్టీ నాలుగు చోట్ల డిపాజిట్లు దక్కించుకుంది. ఇక బీజేపీ మూడు చోట్ల పరిగి, వికారాబాద్, కొడంగల్ నియోజకవర్గాల్లో పోటీ చేయగా తాండూరులో ఆ పార్టీ మిత్ర పక్షం అయిన జనసేనకు టికెట్ కేటాయించింది. అయితే పరిగిలో ఒక్కచోట తప్ప బీజేపీ అభ్యర్థులు కనీసం డిపాజిట్ దక్కించుకోలేకపోయారు. ఇక తాండూరులో జనసేన అభ్యర్థి సైతం డిపాజిట్ కోల్పోయాడు. డిపాజిట్ దక్కించుకునేందుకు కావాల్సిన ఓట్లలో సగం ఓట్లు కూడా తెచ్చుకోలేక జనసేన అభ్యర్థి చతికిలపడిపోయాడు.

పరిగిలోనే బెటర్..


మొత్తం జిల్లాలో ఆయా పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులుగా మొత్తం 61 మంది పోటీ చేయగా ఇందులో 52 మంది అభ్యర్థుల డిపాజిట్లు గల్లంతయ్యాయి. దీంతో పోటీ కేవలం కాంగ్రెస్ వర్సెస్ బీఆర్‌ఎస్ అనేది స్పష్టంగా కనిపించింది. ఒక్క పరిగిలో మినహా జిల్లాలో ఏ నియోజకర్గంలో కూడా బీజేపీ కనీసం పోటీలో కూడా నిలవలేకపోయింది. పరిగి బీజేపీ అభ్యర్థి బూనేటి కిరణ్ 16,597 ఓట్లు సాధించటం ద్వారా డిపాజిట్ దక్కించుకున్నారు. అయితే ఇక్కడ బీజేపీ సాంప్రదాయ ఓటు బ్యాంకు 10వేల వరకు ఉండగా అతని సొంత సామాజిక వర్గం గౌడ కులుస్తుల ఓట్లు సాధించటంలో కొంత వరకు ఆయన సఫలమైనట్లు కనిపించింది. ఈ నేపథ్యంలోనే అతను గౌరప్రదమైన ఓట్లు సాధించారు. ఇక వికారాబాద్‌లో బీజేపీ అభ్యర్థి నవీన్‌కుమార్ 7,128 ఓట్లు సాధించినప్పటికీ డిపాజిట్ మాత్రం దక్కించు కోలేకపోయాడు. కొడంగల్ బీజేపీ అభ్యర్థి బంటు రమేశ్‌కు కేవలం 3,988 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. బీజేపీతో పొత్తులో భాగంగా తాండూరులో పోటీచేసిన జనసేన అభ్యర్థి శంకర్‌గౌడ్‌కు 4,087 ఓట్లు మాత్రమే వచ్చాయి. దీంతో ఇక్కడ కూడా డిపాజిట్ కల్పోయారు. ఇక బీఎస్పీ సైతం జిల్లాలో నాలుగు చోట్ల పోటీచేయగా ఆ పార్టీ అభ్యర్థులు ఏ ఒక్క నియోజకవర్గంలో కూడా డిపాజిట్ దక్కించుకోలేదు. ఇక ఇండిపెండెంట్లు నామమాత్రపు ఓట్లకే పరిమితమయ్యారు.

పోస్టుమార్టం చేసుకుంటున్న నేతలు

కౌంటింగ్ ముగిసి ఫలితాలు తేలటంతో పాటు బూత్‌లు, గ్రామాలు, మండలాల వారీగా.. పార్టీలకు, అభ్యర్థులకు పోలైన ఓట్ల లెక్క తేలింది. దీంతో ఆయా పార్టీలు, అభ్యర్థులు, గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయి నేతలు తమకు, తమ ప్రత్యర్థులకు వచ్చిన ఓట్లను పోస్టుమార్టం చేయటంలో నిమగ్నమయ్యారు. ఎన్ని పోలింగ్ బూత్‌లు, ఎన్ని గ్రామాల్లో తాము ఆధిక్యం సాధించాం...? ఎన్నిచోట్ల మైనస్‌లో ఉన్నాం.. ఏ నాయకుడు ఎంతవరకు ప్రభావం చూపాడు.. ఎంతవరకు ఓట్లు రాబట్టడంలో సఫలమయ్యారు..? ఫలానా గ్రామంలో, ఫలానా బూత్‌లో ఓట్ల మైనస్‌కు కారణ మేంటి...? అన్న తరహాలో వచ్చిన ఫలితాలను పోస్టుమార్టం చేసుకుంటున్నారు. ఎక్కడెక్కడ ఎంత డబ్బులు ఖర్చుచేశాం..ఇచ్చిన డబ్బు ఓటరు వరకు చేరిందా లేదా..? అనే కోణంలోనూ విశ్లేషించుకుంటున్నారు.

సమర్థవంతంగా ఎన్నికల నిర్వహణ

- తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్



తాండూరు: ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా బందోబస్తు చేపట్టామని తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్ తెలిపారు. ఎన్నికల నామినేషన్ ప్రక్రియ మొదలైనప్పటి నుంచి గ్రామాల్లో పోలీసు శాఖ పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసిందన్నారు. తెలంగాణ–కర్ణాటక అంతర్రాష్ట్ర సరిహద్దులో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి మద్యం, డబ్బు అక్రమ రవాణాను కట్టడి చేశామన్నారు. ప్రధాన రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు కూడా శాంతిభద్రతలకు సహకరించారన్నారు. తాండూరు సబ్ డివిజన్ పరిధిలో పోలీసు అధికారులు విధులను సమర్థవంతంగా నిర్వహించారన్నారు. పోలింగ్ రోజు పలుచోట్ల చెదురుమదురు ఘటనలు చోటు చేసుకున్నప్పటికీ వెంటనే కట్టడి చేశామన్నారు. ఈ ఎన్నికలకు సంభందించి తాండూర్ పరిధిలో రెండు కేసులు నమోదయ్యాయన్నారు. ప్రశాంత ఎన్నికలకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

ఆమనగల్లులో ఆధిక్యత చాటుకున్న బీజేపీ

ఆమనగల్లు: అసెంబ్లీ ఎన్నికల్లో ఆమనగల్లు మండలంలో బీజేపీ ఆధిక్యత చాటుకుంది. కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోమొత్తం ఏడు మండలాలు ఉండగా ఆరు మండలాల్లో కాంగ్రెస్ ఆధిక్యతను ప్రదర్శించగా ఒక్క మండలంలో బీజేపీ మెజారిటీ కనబరిచింది. బీజేపీ అభ్యర్థిగా పోటీచేసిన ఆచారి సొంత మండలమైన ఆమనగల్లులో ఆయన ఆధిక్యత కనబర్చారు. గతంలో కూడా ఆమనగల్లు మండలంలో బీజేపీకే మెజార్టీ ఓట్లు వచ్చాయి. ప్రస్తుత ఎన్నికల్లో ఆచారికి 14,257 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డికి 5,602 ఓట్లు, బీఆర్‌ఎస్ అభ్యర్థి జైపాల్‌యాదవ్‌కు 4,528 ఓట్లు వచ్చాయి. బీజేపీకి 8,655 ఓట్ల మెజార్టీ వచ్చింది. గత ఎన్నికల్లో 6 వేలకు పైగా మెజార్టీ రాగా ఈ ఎన్నికల్లో మరింత పెరగడం విశేషం. ఆమనగల్లు మున్సిపాలిటీతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఆచారికి అధికంగా ఓట్లు వచ్చాయి.

ప్రజాతీర్పును గౌరవిస్తాం

వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్

అనంతగిరి: అసెంబ్లీ ఎన్నికల్లో వికారాబాద్ నియోజకవర్గ ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తామని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. సోమవారం పట్టణంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాము ఓడిపోయినప్పటికీ ప్రజా క్షేత్రంలో ఉండి ప్రజల కోసం పనిచేస్తామని తెలిపారు. అభివృద్ధి విషయంలో అధికార పార్టీకి పూర్తి సహకారం అందిస్తామన్నారు. తనకు 5 సంవత్సరాలు సేవ చేసుకునే భాగ్యం కల్పించిన వికారాబాద్ నియోజకవర్గ ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు ఎవరూ అధైర్యపడొద్దని.. తాను అందరికీ అండగా ఉంటానని తెలిపారు. ఎన్నికల్లో నా తరఫున ప్రచారం చేసిన ఎంపీ రంజిత్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలకు రుణపడి ఉంటానన్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని..ఓటమికి గల కారణా లను సమీక్షించుకుంటామన్నారు. తన ఓటమి విషయంలో ఎలాంటి సాకులు చెప్పనని.. ఎవరినీ నిందించే ఆలోచన తనకు లేదన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు రాంరెడ్డి, కౌన్సిలర్ అనంత్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, దేవదాసు, నాయకులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ కేఎస్‌రావు

ఇబ్రహీంపట్నం: మంచాల పీఎస్ పరిధిలో ఆరేళ్ల క్రితం బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో సోమవారం ఎల్బీనగర్ న్యాయస్థానం తీర్పు వెల్లడించింది. ఏసీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇబ్రహీంపట్నం ఏసీపీ కేఎస్ రావు, మంచాల సీఐ కాశీ విశ్వనాథ్, ఎస్‌ఐ రవినాయక్ వివరాలు వెల్లడించారు. 2017లో మంచాల మండలం దాద్‌పల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ సభావత్ అంజిత్ కుమార్(28) గ్రామానికి చెందిన బాలికపై ప్రేమ పేరిట అత్యాచారం చేశాడు. అప్పటి సీఐ గంగారాం పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఎల్బీనగర్ న్యాయస్థానంలో కేసును విచారించిన జడ్జి నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్షతోపాటు రూ.25వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. బాధితురాలికి ప్రభుత్వం నుంచి రూ.10లక్షల పరిహారం మంజూరు చేసినట్లు చెప్పారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేందుకు కృషిచేసిన ఐఓ గంగారం, ఏపీపీ సునీత, కోర్టు డ్యూటీ ఆఫీసర్ రాజేశ్వరి (డబ్ల్యూపీసీ 1045)ని రాచకొండ కమిషనర్ డీఎస్ చౌహాన్ అభినందించారని.. వారికి రివార్డులను అందజేయనున్నట్లు ఏసీపీ కేఎస్ రావు తెలిపారు.

క్లుప్తంగా

బోరు మోటార్‌లో రాళ్లు వేసిన దుండగులు



మరమ్మతులు చేస్తున్న రైతులు

దోమ: గుర్తు తెలియని వ్యక్తులు వ్యవసాయ మోటార్లలో చిన్న పగుళ్ల రాళ్లు వేస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. మండల పరిధిలోని తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన చీమె మైసయ్యకు చెందిన బోరు మోటార్‌లో ఆదివారం రాత్రి దుండగులు రాళ్లు వేశారు. ఉదయాన్నే పంటకు నీరు పెడుదామని ఆయన బోరు వేసేందుకు వెళ్లాడు. అందులో రాళ్లు వేయడంతో అది పాడైపోయింది. దీంతో బాధిత రైతు తీవ్ర ఆందోళనకు గురయ్యాడు. అధికారులు చొరవ తీసుకొని మోటారులో రాళ్లు వేసే వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరుతున్నారు.

గంజాయి విక్రేతకు రెండేళ్ల జైలు

శిక్ష విధించిన వికారాబాద్ కోర్టు

ధారూరు: గంజాయితో పట్టుబడ్డ అస్సాం రాష్ట్రానికి చెందిన మిథున్ బిస్వాల్(30)కు వికారాబాద్ ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీకాంత్ రెండేళ్ల జైలు, రూ.2 వేల జరిమానా విధించారు. సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ సంతోష్‌కుమార్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని స్టేషన్‌ధారూరు సమీపంలో రైల్వే వంతెనపై గంజాయి సంచితో మిథున్ 2021 నవంబర్ 8న పోలీసులకు పట్టుబడ్డాడు. అప్పటి సీఐ తిరుపతిరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మిథున్ బిస్వాల్ గంజాయి గింజలు తీసుకువచ్చి అడవిలో విత్తనాలు చల్లి చెట్లను పెంచుతున్నాడు. 6 నెలలు ఒక ప్రాంతంలో ఉంటే ఆ తర్వాత వేరే ప్రాంతానికి వెళ్లిపోతాడు. అతని వద్ద ఎప్పుడూ గంజాయి విత్తనాలు, ఆకు సిద్ధంగా ఉంటుంది. ముందస్తు సమాచారంతో అప్పట్లో పోలీసులు దాడిచేసి అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. ఆ కేసుకు సంబంధించి సోమవారం తుది తీర్పు వెలువడిందని పోలీసులు తెలిపారు.

నో.. ప్రమోషన్ !

మణికొండ: రాజేంద్రనగర్ నియోజకవర్గానికి నవంబర్ 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులంతా సిట్టింగ్ ప్రజాప్రతినిధులు పోటీ చేసిన విషయం తెలిసిందే. వారిలో సిట్టింగ్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ బీఆర్‌ఎస్ పార్టీ నుంచి పోటీ చేశారు. బీజేపీ పార్టీ నుంచి సిట్టింగ్ మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నుంచి మణికొండ మున్సిపల్ సిట్టింగ్ చైర్మన్ కస్తూరి నరేందర్‌ముదిరాజ్, ఎంఐఎం పార్టీ నుంచి కార్వాన్ సిట్టింగ్ కార్పొరేటర్ స్వామియాదవ్‌లు పోటీ చేశారు. వారిలో ప్రకాష్‌గౌడ్ పదవీకాలం పూర్తవ్వడంతో తిరిగి ఎమ్మెల్యే స్థానానికి పోటీ చేయగా.. మిగతా ముగ్గురు సిట్టింగ్ ప్రజాప్రతినిధులుగా ఉంటూ.. మరింత ఉన్నత స్థానమైన ఎమ్మెల్యేకు పోటీ చేశారు. ప్రకాష్‌గౌడ్ కాకుండా ముగ్గురిలో ఏ ఒక్కరు గెలిచినా.. వారి ప్రస్తుత స్థానం మారి ప్రమోషన్ పొంది ఎమ్మెల్యేగా ఎన్నికయ్యేవారు. కానీ ఓటర్లు దీనికి భిన్నంగా ఎవరి స్థానాల్లో వారే ఉండాలని నిర్ణయించినట్లైంది. ప్రకాష్‌గౌడ్ సైతం ఈసారి గెలుపొందితే నాల్గోసారి అవుతుందని, ప్రభుత్వం వస్తే తనకూ ప్రమోషన్ వచ్చి మంత్రిని అవుతానని అనుకున్నారు. తాను గెలిచి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాకపోవటంతో అతడికి ప్రమోషన్ లేకుండా ఉన్న స్థానంతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చిందని నియోజకవర్గ ఓటర్లు, రాజకీయ నాయకులు చర్చించుకుంటున్నారు. ఏదేమైనా ఎమ్మెల్యేగా ఓడిపోయిన ముగ్గురికి నియోజకవర్గ వారి పార్టీ ఇన్‌చార్జ్‌ల బాధ్యతలు రావడంతో రాబోయే రోజుల్లో రాష్ట్రంలో మాదిరిగానే నియోజకవర్గంలోనూ ప్రతిపక్షం గట్టిగానే ఉండే అవకాశం ఉంటుందని వారు పేర్కొంటున్నారు.

క్రీస్తు నామం.. మార్మోగే క్షణం

- నేటి నుంచి ధారూరు మెథడిస్ట్ క్రిస్టియన్ ఉత్సవాలు
- దేశ, విదేశాల నుంచి రానున్న యాత్రికులు
- వందేళ్ల నుంచి సాగుతున్న జాతర



జాతరలో దుకాణాల ఏర్పాట్లు

ధారూరు: ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ధారూరు మెథడిస్ట్ క్రిస్టియన్ ఉత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. కాగ్నా నది పక్కన మండలంలోని స్టేషన్‌ధారూరు–దోర్నాల్ గ్రామాల మధ్య జాతర జరగనుంది. గత 100 ఏళ్లుగా ఉత్సవాలు నిర్వహించడం ప్రత్యేకం . ఈసారి 10 లక్షల మంది యాత్రికులు వచ్చే అవకాశం ఉందని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. ఏటా నవంబర్‌లో ఈ ఉత్సవాలను నిర్వహించేవారు. ఎన్నికల నేపథ్యంతో డిసెంబర్ 5కు వాయిదా వేశారు. దాదాపు 35 ఎకరాల స్థలంలో కాగ్నా నది పక్కన ఆహ్లాదకరమైన వాతావరణంలో 6 రోజుల పాటు ఉత్సవాలు కొనసాగుతాయి. మంగళవారం నుంచి ప్రారంభమయి ఆదివారంతో ముగుస్తాయి. దీనికి బీదర్, గుల్బర్గ, రాయచూర్, సోలాపూర్, బెంగళూర్, బెల్గాం, గోవా తదితర ప్రాంతాల నుంచే కాక ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని వివిధ జిల్లాల నుంచి భక్తులు తరలివస్తారు. వీరితో పాటు విదేశాల నుంచి ప్రత్యేక ఆహ్వానితులు హాజరవుతారు. జాతరకు వచ్చే వీఐపీల కోసం నిర్వాహకులు తగిన సౌకర్యాలు కల్పిస్తున్నారు. ప్రస్తుతం 101వ జాతరను కొనసాగిస్తున్నారు.



ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఏసుక్రీస్తు శిలువ

చారిత్రక నేపథ్యం..

1921లో గుల్బర్గ నుంచి రైలులో రెవరెన్ సీమండ్స్ అతని మిత్రుడు జేటీ సీమండ్స్‌తో కలిసి హైదరాబాద్‌కు బయలుదేరారు. ధారూరు రైల్వేస్టేషన్‌లో రైలు సాంకేతిక కారణంతో 3 గంటల పాటు ఆగింది. ఇద్దరు మిత్రులు కలిసి రైలు నుంచి దిగి కాగ్నా నది పక్కన ఇప్పచెట్టు కింద ఖాళీ స్థలంలో కూర్చుని ఏసుక్రీస్తు ప్రార్థన చేయగా, వారికి మనశ్శాంతి కలిగింది. హైదరాబాద్‌లో తమ పనికి ఎలాంటి ఆటంకాలు లేకుండా నెరవేరితే ఈ స్థలంలో ఏటా ఉత్సవాలు నిర్వహిస్తామని ఏసుక్రీస్తును వేడుకున్నారు. వారి కోరిక నెరవేరడంతో 1922లో ప్రార్థించిన స్థలంలో ఇప్పచెట్టు కింద ఏసుక్రీస్తు శిలువను స్థాపించి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు.

ఉత్సవాల విశేషాలు..

మెథడిస్ట్ క్రిస్టియన్ ఉత్సవాల్లో ఏసుక్రీస్తు నామంతో కీర్తనలు, భజనలు, ప్రార్థనలు హోరెత్తుతాయి. క్రీస్తు శిలువ దగ్గర 6 రోజులపాటు నిత్యం ప్రార్థనలు కొనసాగుతూనే ఉంటాయి. వక్తల ప్రసంగాలు, నిర్వాహకులతో వివిధ కార్యక్రమాలు కొనసాగుతాయి. జాతరకు వచ్చిన ప్రతి భక్తుడు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హుండీలలో బంగారం, వెండితో పాటు నగదును కూడా దానంగా వేస్తారు. ఏసుక్రీస్తు పేరుతో చాలా మంది గొర్రెలు, మేకలు, కోళ్లు, కోడిగుడ్లు, ఆవులు దానంగా నిర్వాహకులకు అందజేస్తారు.

ప్రభుత్వ ఏర్పాట్లు..

జాతర ప్రాంగణంలో ప్రత్యేకంగా అన్ని చోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తూ పోలీసులు నిఘాను పెంచనున్నారు. కాగ్నా నదిపై ఉన్న పాత వంతెనను తొలగించి కొత్త వంతెన నిర్మాణ పనులు జరుగుతుండటంతో మట్టి రోడ్డును వేడల్పు చేశారు. దోర్నాల్ గ్రామం వైపు సిగిల్ బీటీ రోడ్డు పక్కనే మట్టి వేసి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా చేశారు. భక్తుల సౌకర్యార్థం ప్రభుత్వం తాగునీటి వసతి, మరుగుదొడ్లు, స్నానాల గదులు, ఫ్లడ్‌లైట్లు, చెత్త కుండీలు, మెడికల్ క్యాంపు తదితర సౌకర్యాలను ఏర్పాటు చేస్తోంది. భారీ సంఖ్యలో పోలీసుల బందోబస్తు కొనసాగుతుంది. ధారూరు, బీదర్ మధ్యన ప్రత్యేక రైలు నడుస్తోంది. జాతర జరిగే రోజుల్లో హైదరాబాద్–ముంబాయి మధ్యన కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లు ధారూరు స్టేషన్‌లో ఆగుతాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సులు వేసి ధారూరు జాతర ప్రాంగణం వరకు నడిపిస్తారు.

ముక్కలైన 'గాజు గ్లాసు'

తాండూరులో డిపాజిట్ కోల్పోయిన జనసేన

తాండూరు: తాండూరులో గాజు గ్లాసు ముక్కలైంది. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, జనసేన పార్టీ పొత్తులో భాగంగా తాండూరు స్థానాన్ని జనసేన పార్టీకి చెందిన నేత నేమూరి శంకర్‌గౌడ్‌కు కేటాయించారు. బీజేపీ మద్దతు లభిస్తోందని ఎంతో ఆశతో వచ్చిన శంకర్‌గౌడ్ నామినేషన్ వేసి ఎన్నికల ప్రచారంలోకి దిగారు. అయితే బీజేపీ మద్దతు అంతంత మాత్రంగానే లభించింది. గతంలో తాండూరు నుంచి బీజేపీ పార్టీ నుంచి ఎవరు పోటీ చేసినా 10 వేలకు పైచిలుకు ఓట్లు వచ్చాయి. అయితే ఈ ఎన్నికలలో మాత్రం బీజేపీ శ్రేణులు జనసేన పార్టీకి పూర్తి స్థాయిలో మద్దతు ప్రకటించలేదనే విమర్శలు ఉన్నాయి. దీంతో నేమూరి శంకర్‌గౌడ్‌కు కేవలం 4,087 ఓట్లు మాత్రమే వచ్చాయి. దీంతో జనసేన డిపాజిట్ కోల్పోయింది.

ఏనుగుకు దూరంగా బహుజనులు

గత రెండేళ్లుగా తాండూరు నియోజకవర్గంలో బీఎస్పీ పార్టీ నాయకుడు చంద్రశేఖర్ విస్తృతంగా పర్యటిస్తు వచ్చారు. పార్టీని క్షేత్ర స్థాయిలో బలంగా మార్చుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు. అయితే బహుజన సమాజ్ పార్టీకి బహుజనుల మద్దతు అనుకూలిస్తోందని ఎంతో ఆశపడ్డారు. అయితే కౌంటింగ్ రోజు మాత్రం బీఎస్పీ నాయకులు ఆశించిన స్థాయి ఫలితాలు రాలేదు. కేవలం 2,546 ఓట్లు మాత్రమే రావడం గమనార్హం. స్థానికుడు అయిన బీఎస్పీ అభ్యర్థి చంద్రశేఖర్ కంటే స్థానికేతరుడైన జనసేన పార్టీ అభ్యర్థికి అధికంగా ఓట్లు రావడం విశేషం.

మండలాలన్నీ కాంగ్రెస్‌కు జై

- బీఆర్‌ఎస్ కంచుకోటలో కాంగ్రెస్‌కు మెజారిటీ
- పరిగిలో భారీగా క్రాస్ ఓటింగ్
- స్థానిక నాయకులపై అసమ్మతే కారణం

పరిగి: పరిగి నియోజకవర్గ ప్రజలు అసెంబ్లీ ఎన్నికలో కాంగ్రెస్‌కు పట్టం కట్టారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల తీర్పు కాంగ్రెస్ వైపే ఉండటం గమనార్హం. బీఆర్‌ఎస్ పార్టీకి కంచుకోటలా ఉన్న మండలాలు సైతం ఈసారి కాంగ్రెస్ పార్టీ వైపు మళ్లడంతో ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత తీవ్ర స్థాయిలో ఉందని చెప్పవచ్చు. పరిగి, పూడూర్, దోమ, కుల్కచర్ల, చౌడాపూర్, గండీడ్, మహ్మదాబాద్ మండలాలు ఉండగా మొత్తం ఓటర్లు 2,59,422 మంది ఉన్నారు. ఈ ఎన్నికల్లో 1,98,547 మంది ఓటర్ల తమ ఓటు హక్కును వినియోగించుకోగా 76.53శాతం పోలింగ్ నమోదు అయింది. 2018 కంటే ఈ ఎన్నికల్లో ఓటర్లు పెరగడం, పోలింగ్ శాతం పెరగడంతో బీఆర్‌ఎస్ గెలుపుపై ధీమాగా ఉంది. అంతే కాకా 2018లో ఎమ్మెల్యేగా మహేశ్‌రెడ్డి ఎన్నికైన నాటి నుంచి ప్రజల్లో ఉండటంతో మరింతగా ఊరట నిచ్చింది. కానీ ఈసారి ఎన్నికల్లో ప్రజల తీర్పు కాంగ్రెస్ వైపు ఉండటంతో ఆ పార్టీ అభ్యర్థి రామ్మోహన్‌రెడ్డిని ప్రజలు భారి మెజారిటీతో గెలిపించారు.

అన్ని మండలాల్లో ఆధిక్యం

నియోజకవర్గంలో మొత్తం 305 పోలింగ్ బూత్‌లు ఉండగా అన్నింటిలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ 14 టేబుల్స్‌లను ఏర్పాటు చేసి 22 రౌండ్‌లలో కొనసాగించారు. మొదటి రౌండ్ నుంచి ఆధిక్యం కనబర్చిన కాంగ్రెస్ అభ్యర్థి రామ్మోహన్‌రెడ్డి దోమ మండలంలో బీఆర్‌ఎస్ పార్టీకి 12,636 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థికి 15,773 ఓట్లు వచ్చాయి. గండీడ్‌లో బీఆర్‌ఎస్‌కు 7873 ఓట్లు రాగా కాంగ్రెస్‌కు 11,172 ఓట్లు పోలైయ్యాయి. మహ్మదాబాద్‌లో బీఆర్‌ఎస్‌కు 6897 ఓట్లు రాగా, కాంగ్రెస్ పార్టీకి 11,258 ఓట్లు వచ్చాయి. కుల్కచర్లలో బీఆర్‌ఎస్ పార్టీకి 8326 ఓట్లు రాగా కాంగ్రెస్ పార్టీకి 11,270 ఓట్లు పోలైయ్యాయి. చౌడాపూర్‌లో బీఆర్‌ఎస్‌కి 8715 ఓట్లు, కాంగ్రెస్ పార్టీకి 10,347 ఓట్లు వచ్చాయి. పరిగి మండలంలో బీఆర్‌ఎస్‌కు 16,490 ఓట్లు, కాంగ్రెస్‌కు 20,826 ఓట్లు వచ్చాయి. ప్రతి మండలంలో కాంగ్రెస్ పార్టీ మెజారిటీ సాధిస్తూ బీఆర్‌ఎస్ అభ్యర్థిపై 24,012 ఓట్ల మెజారిటీతో రామ్మోహన్‌రెడ్డి గెలుపొందారు.

నియంత పాలనతో..

ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్యనే పోటి కొనసాగుతూ వచ్చింది. ఈసారి బీజేపీ పార్టీ కూడా గట్టిగానే పోటి చేసి తమ సత్తా చాటాలని భావించింది. కానీ బీజేపీ పార్టీ ఆశించిన స్థాయిలో ఫలితాలను సాధించకపోయినా గతం కంటే ఈసారి ఓటింగ్ శాతాన్ని పెంచుకుంది. నియోజకవర్గంలోని 7మండలాల్లో దాదాపుగా 80శాతంపైగా ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉన్నప్పటికి కాంగ్రెస్ పార్టీకి భారీ మెజారిటీ రావడానికి బీఆర్‌ఎస్ పార్టీ నాయకులే కారణమని పలువురు చర్చించుకుంటున్నారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులే గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీకి క్రాస్ ఓటింగ్ నిర్వహించారని ప్రచారం జరుగుతుంది. నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ పార్టీలో ఒకరిద్దరు ముఖ్య నాయకుల వల్లే ఇది జరిగిందని నియంత పాలన చేయడంతోనే వ్యతిరేక వచ్చిందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

ధారూరులో హస్తం హవా

బీఆర్‌ఎస్‌కు గండి

ధారూరు: ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్‌శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని నింపాయి. ధారూరు మండలం కాంగ్రెస్‌కు కంచుకోటగా మారింది. మండలం నుంచి గత అసెంబ్లీ ఎన్నికల్లో 1,105 ఓట్లు కాంగ్రెస్‌కు లీడ్ రాగా, ఈసారి మాత్రం 2,774 లీడ్ సాధించి బీఆర్‌ఎస్‌ను గండి కొట్టింది. కారు పార్టీ బడా నాయకులు ఉన్న గ్రామాల్లోనే కాంగ్రెస్ పార్టీకి లీడ్ రావటం చర్చనీయాంశమైంది. మాజీ ఎమ్మెల్యే ఆనంద్ గ్రామమైన కేరెల్లితో పాటు బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులున్న ధారూరు, తరిగోపుల, దోర్నాల్, నాగసమందర్, నాగారం, మోమిన్‌కలాన్ బూత్‌లో కాంగ్రెస్ కన్నా బీఆర్‌ఎస్ వెనకంజలో నిలిచింది. మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో హస్తానికి లీడ్ రాగా కేవలం 8 గ్రామాల్లో బీఆర్‌ఎస్‌కు లీడ్ రావడంపై ఆ పార్టీ నాయకులు కంగుతిన్నారు.

కాంగ్రెస్‌కు ఆధిక్యం ఇచ్చిన గ్రామాలు

కేరెల్లిలో 94 ఓట్లు, నాగసమందర్‌లో 699, ధారూరులో 405, గట్టెపల్లి 29, కుక్కిందలో 232, అల్లాపూర్‌లో 55, ధర్మాపూర్, నర్సాపూర్‌లలో 52 చొప్పున, కొండాపూర్‌కలాన్‌లో 70, మున్నూరుసోమారంలో 186, రాంపూర్‌తండాలో 232, స్టేషన్‌ధారూరులో 154, చింతకుంటలో 121, హరిదాస్‌పల్లిలో 80, నాగారంలో 69, తరిగోపులలో 56, అంతారంలో 167, దోర్నాల్‌లో 13, గురుదోట్లలో 64, పీసీఎంతండాలో 163, అంపల్లిలో 19, మోమిన్‌కలాన్‌లో 37, మోమిన్‌ఖుర్దులో 8 ఓట్లు కాంగ్రెస్‌కు అధికంగా వచ్చాయి.

బీఆర్‌ఎస్‌కు..

రాజాపూర్‌లో 6 ఓట్లు, నాగ్‌సాన్‌పల్లిలో 51, మైలారంలో 175, అల్లీపూర్‌లో 72, ఎబ్బనూర్‌లో 41, రుద్రారంలో 33, గడ్డమీది గంగారంలో 44, అవుసుపల్లి బూత్‌లో 7 ఓట్లు బీఆర్‌ఎస్ లీడ్‌లో నిలిచింది.

ఇంట గెలిచారు!

- సొంత గ్రామాల్లో సత్తాచాటిన కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులు
- వీర్లపల్లి, ఎక్లాస్‌ఖాన్‌పేటలో భారీగా నమోదైన పోలింగ్



వీర్లపల్లి శంకర్



అంజయ్య యాదవ్

షాద్‌నగర్: సొంతూరు నుంచి ప్రస్థానం ప్రారంభించిన నేతలెందరో ఉన్నతంగా ఎదిగారు. ప్రతిపక్ష నాయకుల మాటలను తిప్పి కొట్టేందుకు వారి ఊరును అభివృద్ధిలో చక్కబెట్టుకుని క్రమ క్రమంగా ప్రయాణం సాగిస్తుంటారు. గ్రామ ఓటు బ్యాంకు సైతం గెలుపోటములను శాసిస్తాయనడంలో సందేహమే అవసరం లేదు. షాద్‌నగర్ నియోజకవర్గం నుంచి బీసీ సామాజిక వర్గానికి చెందిన నేతలు కాంగ్రెస్ అభ్యర్థిగా వీర్లపల్లి శంకర్, బీఆర్‌ఎస్ నుంచి అంజయ్య యాదవ్ పోటీ పడ్డారు. వారి వారి స్వగ్రామాల్లో వారిదే పై చేయిగా నిలిచింది.

- కాంగ్రెస్ అభ్యర్థి శంకర్ గ్రామం వీర్లపల్లిలో 1175 మంది హస్తానికి, 834 మందకి కారుకు ఓటేశారు.
- బీఆర్‌ఎస్ అభ్యర్థి అంజయ్య యాదవ్ గ్రామం ఎక్లాస్‌ఖాన్‌పేటలో కారుకు 972 ఓట్లు పోలవ్వగా కాంగ్రెస్‌కు 493 మంది ఓటేశారు.

అధిక శాతం పోలింగ్ నమోదు

బరిలో ఉన్న అభ్యర్థుల సొంత గ్రామాల్లో ఓటర్లలో చైతన్యం వెల్లివిరిసింది. ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఓటర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆయా గ్రామాల్లో పోలింగ్ శాతం భారీగా నమోదైంది. నందిగామ మండలం వీర్లపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన మూడు పోలింగ్ కేంద్రాల్లో 2,525 మంది ఓటర్లు ఉండగా 2,227 ఓట్లు పోలయ్యాయి. ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామంలో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 1,725 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 1,558 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. సొంత గ్రామాల్లో అభ్యర్థులు ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నించడం, అభ్యర్థులకు చెందిన మద్దతు దార్లు ఓటర్లను చైతన్యం చేయడం, నేను మీఊరి వాడినే గెలిపిస్తే ఊరు మరింత అభివృద్ధి చెందుతుందని అభ్యర్థులు హామీలు ఇవ్వడం తదితరాలు ఓటింగ్ శాతం పెంపునకు కారణమయ్యాయి.

నోటాకు ఓటేశారు

ఎన్నికల సంఘం పోటీ చేసే అభ్యర్థులు నచ్చకపోతే నోటాకు ఓటు వేసే అవకాశం కల్పించింది. ఈ ఎన్నికల్లో బరిలో ఉన్న అభ్యర్థుల సొంత గ్రామాల్లోనూ పలువురు ఓటర్లు అభ్యర్థులెవరు నచ్చకపోవడంతో నోటాకు ఓటేశారు. వీర్లపల్లిలో 11 మంది, ఎక్లాస్‌ఖాన్‌పేటలో 8 మంది ఓటర్లు నోటాకు ఓటేశారు.

గ్రంథాలయానికి గ్రహణం

- పార్ట్‌టైం వర్కర్‌తోనే నిర్వహణ
- సొంత భవనం లేక ఇబ్బందులు
- శాశ్వత గ్రంథపాలకుడిని నియమించాలని వినతి



గ్రంథాలయంలో ఉన్న పాతపుస్తకాలు

దౌల్తాబాద్: మండల కేంద్రంలోని గ్రంథాలయానికి శాశ్వత గ్రంథపాలకుడు లేక పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి రోజు గ్రంథాలయానికి 80 మందికిపైగానే పాఠకులు వెళ్తుంటారు. కానీ పార్ట్‌టైం వర్కరే ఈ గ్రంథాలయానికి దిక్కయ్యారు. దీనికి సొంత భవనం కూడా లేదు. గతంలో పాత గ్రామపంచాయతీ భవనంలో కొనసాగేది. అది శిథిలావస్థకు చేరడంతో ప్రస్తుతం ఉన్నత పాఠశాల ఆవరణలోని ఓ గదిలో కొనసాగిస్తున్నారు. గ్రంథాలయాన్ని ప్రశాంతమైన వాతావరణంలో ఏర్పాటు చేయాలని పాఠకులు కోరుతున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యారు.

ఐదేళ్ల నుంచి అవస్థలు..

గ్రంథాలయానికి గత ఐదేళ్ల నుంచి శాశ్వత లైబ్రేరియన్ లేరు. అంతకు ముందు ఉన్న లైబ్రేరియన్ ఇక్కడి నుంచి బదిలీ అయ్యారు. దీంతో గ్రామానికి చెందిన మంగలి వెంకటయ్య పార్ట్‌టైం వర్కర్‌గా సేవలందిస్తున్నారు. ప్రతి రోజు పాఠకులకు పుస్తకాలు ఇవ్వాలన్నా మరే చదువుకు సంబంధించిన విషయానికైనా లైబ్రేరియన్ లేని దుస్థితి ఏర్పడింది. గ్రంథాలయంలో ఏళ్ల క్రితం వచ్చిన పుస్తకాలు మాత్రమే ఉన్నాయి. సభ్యులకు కొత్త పుస్తకాలు ఇవ్వలేకపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రంథాలయానికి శాశ్వత గ్రంథపాలకుడిని నియమించాలని పాఠకులు కోరుతున్నారు.

యువకుడి అదృశ్యం



శివకుమార్ (ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్: ఇంట్లోంచి బయటకు వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమైన ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన ఈజమల్ల రాంకోటి కుమారుడు శివకుమార్ (24) నగరంలో సీసీ కెమెరాల పని నేర్చుకుంటున్నాడు. ఈ క్రమంలో అక్టోబర్ 15న ఇంటి నుంచి వెళ్లిన శివకుమార్ తిరిగి రాలేదు. గతంలోనూ ఇదే మాదిరిగా వెళ్లిన శివకుమార్ రెండు నెలల తర్వాత ఇంటికి వచ్చాడు. ఈ సారి రాకపోవడంతో అతని ఆచూకీ కోసం కుటుంబసభ్యులు వాకబు చేయగా ఫలితం లభ్యమవ్వలేదు. సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ ఉండడంతో ఆందోళనకు గురైన శివకుమార్ తండ్రి అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

మెజార్టీ పెరుగుతూ వచ్చి.. స్వల్ప తేడాతో గట్టెక్కి

మొయినాబాద్: చేవెళ్ల నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కాలె యాదయ్య స్వల్ప మెజార్టీతో విజయం సాధించిన విషయం తెలిసిందే. మొదట్లో ఆయన మెజార్టీ పెరుగుతూ వచ్చింది. అయితే మొయినాబాద్, షాబాద్, చేవెళ్ల మండలాల్లో కాంగ్రెస్ అభ్యర్థి భీంభరత్‌కు లీడ్ ఇచ్చాయి. బీఆర్‌ఎస్ అభ్యర్థి యాదయ్యకు నవాబ్‌పేట్ మండలంలో 1,966 ఓట్ల మెజార్టీ, శంకర్‌పల్లి మండలంలో 5000 ఓట్ల మెజార్టీ వచ్చింది. కాంగ్రెస్ అభ్యర్థి భీంభరత్‌కు మొయినాబాద్ మండలంలో 1,760 ఓట్ల మెజార్టీ, షాబాద్ మండలంలో 1,564 ఓట్ల మెజార్టీ, చేవెళ్ల మండలంలో 2,100 ఓట్ల మెజార్టీ వచ్చింది. పోస్టల్ బ్యాలెట్ ఓట్లలోనూ కాంగ్రెస్ అభ్యర్థికి 575 ఓట్ల లీడ్ వ చ్చినప్పటికీ కాంగ్రెస్ అభ్యర్థి విజయాన్ని అందుకోలేకపోయారు. శంకర్‌పల్లి మండలంలో యాదయ్యకు ఏకంగా 5000 ఓట్ల ఆధిక్యం రావడంతో చివరికి 268 ఓట్లతో గట్టెక్కారు.

ఓటర్లు బీఆర్‌ఎస్ డబ్బుకు లొంగలేదు



సమావేశంలో మాట్లాడుతున్న గురునాథ్‌రెడ్డి

మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి

కొడంగల్: బీఆర్‌ఎస్ నాయకులు పంచిన డబ్బులకు కొడంగల్ ఓటర్లు లొంగలేదని మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లను కొనుగోలు చేయడానికి బీఆర్‌ఎస్ పార్టీ ఓటుకు రెండు వేల చొప్పున పంపిణీ చేసినట్లు ప్రచారం జరిగిందన్నారు. నగదు పంపిణీ వల్ల ఏమైనా ఇబ్బందులు వస్తాయని అనుమానం పడినట్లు చెప్పారు. అయితే కొడంగల్ ప్రజలు అభిమానానికి, ఆత్మ గౌరవానికి ఓటు వేసినట్లు తెలిపారు. భారీ మెజారిటీతో రేవంత్‌ను గెలిపించినందుకు నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు చెప్పారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఏన్గుల భాస్కర్, డీడీఎస్ జిల్లా అధ్యక్షుడు జయతీర్థాచారీ, హన్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల నుంచి వచ్చిన నాయకులు కార్యకర్తలు గురునాథ్‌రెడ్డిని సన్మానించారు. ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డిలను కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రుద్రారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సాయిలు, ఆనంద్‌రెడ్డి, వెంకటయ్య గౌడ్ తదితరులు సన్మానం చేశారు.

పాపం పసివాడు..!

- రోడ్డు ప్రమాదంలో బాలుడికి గాయాలు

షాద్‌నగర్: పదేళ్లయినా నిండని పసి భవితవ్యం ముందుకు అడుగు వేయకుండా పోయింది.. అక్షరాల వైపు బుడి బుడి నడకలు వేసే కాళ్లు రక్తపు ముద్దగా మారిపోయాయి. ఈ హృదయ విదారకమైన ఈ సంఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రాయికల్ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం గంగాధర్‌పల్లి గ్రామ పరిధిలోని కుంటలోపుతండాకు చెందిన నీలా, తావుర్యా దంపతులకు ముగ్గురు సంతానం. వీరు రాయికల్ ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నారు. కుమారుడు అశోక్ (9) నాలుగో తరగతి చదువుతున్నాడు. సోమవారం పాఠశాల నుంచి ఇంటికి వెళ్లేందుకు సహ విద్యార్థులతో కలిసి రోడ్డుపై వేచిఉన్నారు. షాద్‌నగర్ నుంచి సూరారం వెళ్లే బస్సు రాగానే విద్యార్థులంతా బస్సు వెంట పరుగులు తీశారు. బస్సు ఎక్కే క్రమంలో అశోక్ బస్సు వెనక టైర్ల కింద పడగా బస్సు టైర్లు రెండు కాళ్ల పై నుంచి వెళ్లాయి. దీంతో బాలుడి రెండు కాళ్లు పూర్తిగా నుజ్జునుజ్జయ్యాయి. బాలుడిని చికిత్స నిమిత్తం శంషాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తామని కుటుంబ సభ్యులు వెల్లడించారు.

శంషాబాద్‌లో కాంగ్రెస్ నేతల సంబురాలు

శంషాబాద్: రాష్ట్రంలో మెజార్టీ ఎమ్మెల్యే స్థానాలు కైవసం చేసుకుని కొత్త ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేయడంతో ఆ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నాయి. శంషాబాద్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పి. సంజయ్‌యాదయ్ ఆధ్వర్యంలో పార్టీ నేతలు పెద్ద ఎత్తున బాణా సంచా పేల్చారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీతో సుపరిపాలనకు అడుగులు పడ్డాయని పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్ అన్నారు. సులోచన, శ్రీధర్, శంషుద్దీన్, బొబ్బిలి కిష్టయ్య, మహేందర్ ముదిరాజ్, కోటేశ్వర్‌గౌడ్, సిద్దేశ్వర్‌గౌడ్ గని, జహంగీర్ , పరమేష్, నర్సింహా, నర్సింగ్‌రావు, భాస్కర్‌రెడ్డి, అక్రమ్‌ఖాన్, సిద్దేశ్వర్‌గౌడ్ దయానంద్, యాదగిరి, కొంకర రాజు పాల్గొన్నారు.